క్లుప్తంగా

గుంతల పూడ్చివేతకు భిక్షాటన


పదివేలు అందిస్తున్న అల్లూరి శ్రీనాథరెడ్డి

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చడానికి యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. యువజన సంఘాల నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ రోడ్డుగా విస్తరించాలని నవంబర్‌లో మహాధర్నా నిర్వహించామని, కనీసం రహదారిపై గుంతలను పూడ్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గుంతలను పూడ్చివేతకు భిక్షాటన చేపట్టామని తెలిపారు. శ్రీనాథ్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ రూ. 10 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ముస్కు ఉపేందర్‌రెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి, కాంతాల అంజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, కుర్ర హరీశ్, కొలుపుల రవీందర్, మాతంగి అనిల్, ప్రశాంత్, చింటూ, గౌతమ్ పాల్గొన్నారు.

గర్శకుర్తిలో పౌరహక్కుల దినోత్సవం


సమావేశంలో అధికారులు, గ్రామస్తులు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ అలువాల నాగలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తడిగొప్పుల రజిత, ఎంపీడీవో భాస్కర్‌రావు, డీటీ చంద్రశేఖర్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మ్యాక వినోద్, నాయకులు ద్యావ సంజీవ్,శ్రీనివాస్, తాళ్ల శ్రీనివాస్, పొత్తూరి సురేష్, హెచ్‌సీ కొంరయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


నగదు, మోమెంటో అందిస్తున్న వెంకట్రాజం

ఇల్లందకుంట: విద్యార్థులు ఇష్టంతో చదవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషన్ స్పీకర్ మామిడాల వెంకట్రాజం అన్నారు. శనివారం మండలంలోని సిరిసేడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. పదిలో మార్కులు సాధించడానికి విద్యార్థులు ఎలా ముందుకుసాగాలో వివరించారు. పరీక్షలకు భయపడకుండా అర్థం చేసుకుంటూ చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మంచి ఉద్యోగాలు సాధించి సమాజానికి సేవ చేయాలన్నారు. 2022లో పది ఫలితాల్లో పాఠశాల నుంచి అత్యధిక మార్కులు సాధించిన భోగం మేఘనకు వెయ్యి, కుమారస్వామికి రూ.800 రూపాయలు, మోమెంటో తండ్రి మామిడాల శంకరయ్య జ్ఞాపకార్థం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఉప్పు దుర్గయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్త ఏడాది.. కొంగొత్త ఆశలతో..

- లక్ష్యం వైపు అడుగులు వేస్తాం
- ప్రణాళికతో సవాళ్లను అధిగమిస్తాం
- సర్కార్ కొలువు సాధిస్తాం
- విజయతీరమే 'కొత్త' లక్ష్యం
- విద్యార్థుల్లో 'నూతన' ఉత్సాహం
- 'శ్రీచైతన్య' డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' క్యాంపస్ కబుర్లు


'సాక్షి' క్యాంపస్ కబుర్లలో పాల్గొన్న శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ సరికొత్త ఆశలతో నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్నాం. యువతరం కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ లక్ష్యాన్ని చేరేందుకు సరికొత్త అడుగులు వేస్తామంటున్నారు. ఎప్పటికప్పుడు సమాజంలో వస్తున్న మార్పులు, ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలకు పదునుపెడుతూ విజయతీరాలకు చేరాల్సిన మెలకువలను ఒంటపట్టించుకుంటామంటున్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ కోరుకున్న కొలువులకు కావాల్సిన అంశాలపై కొత్త సంవత్సరంలో అడుగులు వేస్తామంటున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే మూసపద్ధతి కాకుండా ఆధునాతన మార్గాల్లో వెళ్తేనే విజయం సాధ్యపడుతుందని భావించి సరికొత్త సృజనాత్మక ఆలోచనలతో ముందుకెళ్తామని విద్యార్థులు చెబుతున్నారు. లోపాలను సవరించుకొని కొత్త సంవత్సరంలో కొత్త సవాళ్లను అధిగమిస్తూ పరుగులు పెడుతామని యువతరం అంటున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ కబుర్లు కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు పాల్గొని వారి మనోభావాలను వెల్లడించారు.

కోరుకున్న కొలువు కోసం



నూతన సంవత్సరంలో అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకుందామని అనుకుంటున్నాను. గతంలో కంటే చదువుకు ఇంకా ఎక్కువ సమయం కేటాయించి కోరుకున్న కొలువు కోసం కష్టపడాలని నిర్ణయించుకున్నాను.

– జి.సాయిప్రియ, తిమ్మాపూర్

లక్ష్యాన్ని గుర్తుచేసుకుంటా



నిత్యం లక్ష్యాన్ని గుర్తు పెట్టుకొని దానికి కొంతసమయం కేటాయిస్తే ఖచ్చితంగా విజయ తీరాలకు చేరవచ్చు. పక్కాప్రణాళికతో ముందుకు సాగుతాను.కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించి తీరుతా.

– పి.అమిత, జగ్గారావుపల్లి

సరికొత్తగా లక్ష్యం వైపునకు..



నూతన సంవత్సరంలో సరికొత్తగా లక్ష్యం వైపునకు అడుగులు వేస్తా. ఇప్పటివరకు అవగాహన లోపంతో కొంత సమయాన్ని వృథా చేశాం. ఇప్పుడు దానిని సవరించుకొని లక్ష్య సాధన కోసం కేటాయిస్తా.

– అస్మిత, కరీంనగర్

వ్యాపార మెలకువలు నేర్చుకుంటా



వ్యాపారవేత్త కావాలని లక్ష్యం ఉంది. నేను డిగ్రీ చదువుతున్నాను. కోర్సులోని పాఠ్యాంశాలతో పాటు నూతనంగా వ్యాపార మెలకువలను నేర్చుకుంటాను. అన్ని వ్యాపారాలను అధ్యయనం చేసి మార్కెట్‌ను అంచనా వేస్తాను. – జి.శ్రీజా, కేశవపట్నం

లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలి



విద్యార్థులు నూతన సంవత్సర సందర్భంగా తమ లక్ష్యసాధనపై దృష్టి సారించాలి. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే పాఠ్యాంశాలతో పాటు మారుతున్న టెక్నాలజీ, నైపుణ్యాలపై పట్టుసాధించాలి. సరికొత్త ఆలోచనలో ముందుకు సాగుతూ విజయతీరాలకు చే రాలనే నా ఆకాంక్ష.

– ముద్దసాని రమేశ్‌రెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్

చదవడానికి ఎక్కువ సమయం



డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న. మొదటి సంవత్సరాల కంటే ఇప్పుడు నూతన సంవత్సరంలో చదవడానికి ఎక్కువ సమయం కేటాయించాలనుకుంటున్నాను. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను.

– జయశ్రీ, గంగాధర

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా



చిన్న నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. నూతన సంవత్సరం సందర్భంగా ఇప్పటి నుంచే ఉద్యోగం సాధించేందుకు ప్రిపేర్ అవుతూ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధిస్తా.

– ఎం.శైలజ, బోయినిపల్లి

భూ ఆక్రమణపై విచారణ

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 629లో షాదీఖాన కోసం మైనార్టీలకు కేటాయించిన భూమి ఆక్రమణకు గురైందని, మైనార్టీ నాయకులు ఆందోళన చేశారు. శనివారం తహసీల్దార్ రాజేశ్వరి సమస్యపై విచారణ చేపట్టారు. అనంతరం రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ కేటాయించిన ఐదుగుంటల భూమిని సర్వేయర్ ద్వారా కొలతలు చేపట్టి భూమి అప్పగిస్తామని, ప్రభుత్వం కేటాయించినప్పుడు హద్దులు నిర్ణయించుకుంటే ఇలాంటి సమస్యలురావని సూచించారు.

హీరాబెన్‌కు నివాళి

రామడుగు: మండల కేంద్రంలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ తల్లి హీరాబెన్ మృతిపట్ల బీజేపీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, శ్రీకాంత్, రాంలక్ష్మన్, నిరంజనాచారి, శ్రీనివాసాచారి, కనకయ్య, అంజయ్య పలువురు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

గన్నేరువరం మండలంలోని జంగపల్లి చౌరస్తా వద్ద పూలే విగ్రహం ఏర్పాటుతో పాటు మైలారం గ్రామంలో అమరవీరుల స్తూపం, గన్నేరువరం నుంచి కాసింపేట మానసాదేవి టెంపుల్ వరకూ సెంట్రల్ లైటింగ్, మాదాపూర్ బతుకమ్మ ఘాటు వద్ద లైటింగ్ పనులకు సంబంధించి కోటి రూపాయల పనులను జడ్పీటీసీ మాడుగుల రవీందర్ శనివారం పరిశీలించారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లికి చెందిన మూగల రాధమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని సంతాపం వ్యక్తం చేశారు.

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకురాలు ఎంపీ బేబీ గ్రామంలో జరిగిన దాడిలో గాయపడి కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. శనివారం వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజక వర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ ఆమెను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, నాయకులు పలువురు పాల్గొన్నారు.

రేపు ముక్కోటి ఏకాదశి

చొప్పదండి: పట్టణంలోని శివకేశవాలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఉత్తర ద్వారా దర్శనం, కల్యాణ ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటికీ తిరుగుతూ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఏడాదిగా తొలిపొద్దు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని తొమ్మిది గ్రామాల్లో వేకువజామున పర్యటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాలలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: పేదలు వైద్యం చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. గంగాధరకు చెందిన కనకమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యఖర్చులకు రెండున్నర లక్షల ఎల్‌వోసీని బాధితురాలికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులకు సీఎంఆర్‌ఎఫ్ అందుతుందని పేర్కొన్నారు.

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం రోడ్డులోని చర్చిలో న్యూ ఇయర్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చర్చి నిర్వాహకులు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముద్దం మహేశ్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు 'వాగేశ్వరి' విద్యార్థులు



తిమ్మాపూర్: ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వంశీ, నీరజ్‌కుమార్ ఎంపికయ్యారని కళాశాల సెక్రెటరీ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల జాయింట్ సెక్రెటరీ డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్థికసాయం

జమ్మికుంట: పేద విద్యార్థినికి మహా ఆదిసేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన మొలుగూరి నిరోషా మంచిర్యాలలో జేఎస్ఎం మొదటి సంవత్సరం చదువుతోంది. ఫీజు చెల్లించడానికి డబ్బులు లేక పోవడంతో ఏడువేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు స్వామి, ఆర్ఎంపీ డాక్టర్ మడిపల్లి అశోక్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన రాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం రాజుతో చదువుకున్నవారు రూ. 14,500 ఆర్థిక సాయం అందించారు. మేడిపల్లి మల్లేశం పదివేలు, బండారి శంకర్, భక్తు లక్ష్మయ్య, అంజయ్య, దేవేందర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, సత్య గంగయ్య తలాకొంత సాయం చేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తిమ్మాపూర్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా తుమ్మనపల్లి యువసేన సభ్యుడు గుంటి మధుకర్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. మన్నెంపల్లిలో ప్రారంభమైన కార్యక్రమానికి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ అంజయ్య విద్యార్థులు పదిలో 10 జీపీఏ సాధించాలని సూచించారు.

దుప్పట్లు..

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామ పంచాయతీ కార్మికులకు మండల బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు సింహాచలం ప్రభాకరాచార్యులు శనివారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రూ. 20 వేల విలువైన దుస్తులు, దుప్పట్లు కార్మికులకు అందజేయడం పట్ల దాతను సర్పంచ్‌విద్యాసాగర్‌రెడ్డిఅభినందించారు.

వీల్‌చైర్ అందజేత

జమ్మికుంట: మున్సిపాలిటీ పరిధి మోత్కులగూడెంకు చెందిన బిట్ల షణ్ముకసాయి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. ఆలయ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ గుణసాగర్ ఫౌండేషన్ మార్గ దర్శకుడు పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) దృష్టికి తీసుకెళ్లి షణ్ముఖసాయికి వీల్‌చైర్ అందించారు.

బీమా నగదు..

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో పురుషుల పొదుపు సంఘం సభ్యుడు సంది మహేందర్‌రెడ్డి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య రజితకు రూ.60వేల బీమా నగదును సంఘం కార్యాలయంలో ఆవరణలో సంఘం అధ్యక్షుడు కంది వేణు శనివారం అందజేశారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి వెంకటరమణాచార్యులు అయ్యప్పస్వాములకు ఇరుముడి కట్టి శబరిమల యాత్రను ప్రారంభించారు.

దళితులకు భూమి అప్పగించాలి


మాట్లాడుతున్న పౌర హక్కుల నాయకులు

జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామ దళితులకు చెందిన 30 గుంటల భూమిని అక్రమంగా కబ్జా చేసిన వ్యక్తులు వెంటనే భూమిని దళితులకు అప్పగించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. ఇనాం కింద ఇచ్చిన భూమి కబ్జా చేశారనే విషయంపై గ్రామస్తులను కలిశారు. దళితులకు అన్యాయం జరిగితే సహించమని, వారిపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, భూ కబ్జాకు సహకరించిన రెవెన్యూ అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌరహక్కుల అధ్యక్షుడు రాజగోపాల్, లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, నాయకులు ఆదిత్య, వినోద్, వెంకట్, దేవునూరి రవీందర్, వెంకట్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి


సన్మానిస్తున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

రామడుగు: సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖ నోడల్ అధికారి జలాలొద్దీన్ అక్బర్ సూచించారు. రామడుగు సహకార సంఘం కార్యవర్గ సమావేశం శనివారం చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సంఘం చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులు చర్చించి తీర్మానాలు చేశారు. టీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన జలాలొద్దీన్ అక్బర్‌ను వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంట్ల రవీందర్‌రెడ్డి, సీఈవో మల్లేశం, డైరెక్టర్లు గోనెపల్లి లచ్చయ్య, ద్యావ అనంతరెడ్డి, తాడెం మల్లయ్య, మ్యాకల కమల, చిమ్మల్ల తిరుపతి, ఊట్కూరి అనిల్‌రెడ్డి, కర్నూజ వెంకటేశం, మానుపాటి లచ్చయ్య సిబ్బంది పాల్గొన్నారు.